ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ **కోనసీమ** జిల్లా వార్తలు

బుధవారం 1 అక్టోబరు 2025 | 3





సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా దసరా ఉత్సవాలు 6

- ప్రత్యేక ఆకర్షణగా చెడీతాలింఖానా
- రేపు అమలాపురంలో దసరా ఉత్సవ ప్రదర్శనలు

బాణసంచా పేలి భార్యాభర్తలు మృతి

మెయిన్‌స్టోరీ...

- అయినవిల్లి మండలం విలస గ్రామంలో ఘటన

అనుమతి లేకుండా బాణసంచా నిల్వ వద్దు

- ఎస్పీ కార్యాలయం

అమలాపురం,సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి):అయినవిల్లి మండలం విలసలో బాణసంచా పేలుడు ఘటనలో ఇద్దరు దంపతులు మృతి చెందిన ఘటనపై జిల్లా ఎస్పీకార్యాలయం ఒక ప్రకటన విడుదలచేసింది. మందుగుండు సామాగ్రిని వంటగదిలోని అటకనుంచి దింపుతుండగా ఫైర్‌అయ్యి ఇంట్లోని కొంతభాగం కూలినట్లు తెలిపింది.గతేడాది మిగిలిన బాణాసంచాను లైసెన్సు కలిగి ఉన్న గొడౌన్స్‌వద్దే భద్రపరుచుకోవాలని, లేనిచోట భద్రపరచడం, విక్రయించడం వంటి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



ముమ్మిడివరంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని రూ.50లక్షల నగదుతో అలంకరించిన దృశ్యం

రూ.50లక్షలతో అమ్మవారికి అలంకరణ

ముమ్మిడివరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల్లో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం మెయిన్‌రోడ్డులో ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు మంగళవారం మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రూ.50లక్షలతో అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కొత్తగా 110 వాహనాల కొనుగోలు

అమలాపురం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వారం రోజులుగా 110 రవాణా వాహనాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. జీఎస్టీ తగ్గిన నేపథ్యంలో దసరా పండుగను పురస్కరించుకుని వాహనదారులు వాహనాల కొనుగోలు వైపు మొగ్గుచూపారని ఆయన అన్నారు. రిజిస్ట్రేషన్ అయిన వాహనాల్లో 80 ప్యాసింజర్ ఆటోలు, 10 లైట్ గూడ్స్ వాహనాలు, 10 మోటారు క్యాబ్‌లు, 5 ఎలక్ట్రికల్ వాహనాలు, 5 పది చక్రాల లారీలు ఉన్నాయన్నారు. వీటి కొనుగోలువల్ల ట్యాక్స్, ఫీజుల రూపంలో రవాణా శాఖ ద్వారా ప్రభుత్వానికి రూ.23లక్షల ఆదాయం సమకూరిందని, జీఎస్టీ తగ్గడం వల్ల ఈ నూతన వాహనాల కొనుగోలుపై ప్రజలు దృష్టిసారించడంపట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

వర్షాభావం

లోటు.. కలవరం!



- ముగిసిన నైరుతి రుతుపవనాల సీజన్.. సీజనంతా లోటు వర్షపాతమే
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అధిక వర్షపాతానికి బదులు అంతా కొరతే
- కాకినాడ జిల్లాలో 21మండలాలకుగాను 16మండలాల్లో లోటు వర్షపాతం
- కోనసీమలోని 22 మండలాలూ లోటుతో అన్నీ రెడ్‌మార్క్‌లో చేరిన వైనం
- తూర్పుగోదావరిలో 19 మండలాలకు తాళ్లపూడి మినహా అన్నీ కొరతే
- అల్లూరి జిల్లా పరిధిలోని ఏజెన్సీ మండలాల్లోనూ కొంత ఇదే పరిస్థితి

(కాకినాడ- ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది వర్షాకాలం సీజన్ నిరాశే మిగిల్చింది. నైరుతి పవనాలు ఊరించి ఊరించి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను ఉసూరుమనిపించాయి. మంగళవారంతో ముగిసిన నాలుగు నెలల రుతుపవనాల సీజన్ ఉమ్మడి జిల్లాను లోటు వర్షపాతంలోకి నెట్టింది. కావలసిన సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతంలో రెడ్‌మార్క్‌లోకి చేరింది. కాకినాడ, తూ.గో. కోనసీమ జిల్లాల్లో కలిపి 62 మండలాలకుగాను 57 మండలాలు, అటు అల్లూరి ఏజెన్సీ ప్రాంతంలోని 11 మండలాలకుగాను 5 మండలాల్లో అత్యధిక వర్షపాతం, మిగిలిన 6 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. గతేడాది రుతుపవనాల సీజన్‌లో ఉమ్మడి జిల్లాలో భారీ వర్షాలతో అదనపు వర్షపాతం జాబితాలో చేరగా, ఈ సీజన్‌లో మాత్రం లోటులో చేరింది.

ఊరించి.. ఉసూరుమనిపించి...

ఏటా రుతుపవనాల సీజన్ జూన్ నుంచి సెప్టెంబరు వరకు కొనసాగుతుంది. నాలుగు నెలల వ్యవధిలో కురిసే భారీ వర్షాలే వ్యవసాయ రంగానికి, భూగర్భజలాలకు కీలకం. అయితే ఈసారి నైరుతి రుతుపవనాలు ఉమ్మడిజిల్లాను ఈసురోమనిపించింది. ఏటా ఈ సీజన్‌లో భారీ వర్షాలు కురుస్తాయన్న అంచనాలను తల్లకిందులు చేసింది. తొలి రెండు నెలలైన జూన్, జూలైలో వాన జాడే కనిపించకపోవడంతో అంతా ఆగస్టు, సెప్టెంబరులో కురిసే భారీ వర్షాలతో అయినా లోటు తీరుతుందని భావించారు. తీరా మంగళవారంతో ముగిసిన నాలుగు నెలల సీజన్ పరిశీలిస్తే పూర్తిగా లోటు వర్షపాతమే మిగిలింది. కురవాల్సిన సాధారణ వర్షపాతం కాదు కదా అంతకంటే తక్కువగా నమోదైంది. దీంతో ఈఏడాది వర్షాకాలం సీజన్ తక్కువ వర్షాలతో ముగిసినట్టయింది. వాస్తవానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నాలుగు నెలలకు కలిపి సాధారణ వర్షపాతం 2,235మి.మి. నమోదవాల్సి ఉంటే కేవలం 1673మి.మి. నమోదైంది. కాకినాడ జిల్లాలో నాలుగు నెలల సీజన్‌కు కలిపి 670.1మి.మి. వర్షపాతం కురవాల్సి ఉంటే కేవలం 533.8.మి.మి. నమోదైంది. దీంతో జిల్లా లోటు వర్షపాతం జాబితాలో రెడ్ మార్క్‌లో చేరింది. ఈ జిల్లాలో నాలుగు నెలలకు కలిపి సరాసరి వర్షం కురిసిన రోజులు కేవలం 36 మాత్రమే. దీంతో సెప్టెంబరు 30నాటికి నాలుగు నెలల వ్యవధిలో కావలసిన వర్షపాతం కంటే మైనస్ 20.34% లోటు కనిపిస్తోంది. కోనసీమ జిల్లాలో ఈ సీజన్‌లో 779 మి.మి. వర్షపాతానికిగాను కేవలం 539.2మి.మి. నమోదైంది. 30.78% లోటు తేలి డెఫిసిటీ కేటగిరీలో జిల్లా చేరింది. నాలుగు నెలలకు కలిపి ఈ జిల్లాలో వర్షం కురిసిన సరాసరి రోజులు కేవలం 35. తూ.గో.జిల్లాలో ఈ సీజన్‌లో 775.9మి.మి. వర్షపాతం నమోదవాల్సి ఉంటే కేవలం 600.1 నమోదైంది. 22.66% లోటు వర్షపాతంలో జిల్లా రెడ్‌మార్క్‌లో చేరింది. ఈ జిల్లాలో సీజన్‌లో వర్షం కురిసిన రోజులు 43గా నమోదైంది. వాస్తవానికి గత నెల వరకు కాకినాడ జిల్లా ఒక్కటే సాధారణ వర్షపాతంతో గ్రీన్ జాబితాలో ఉండగా, సెప్టెంబరులోను తగినంత వాన లేకపోవడంతో రెడ్‌లోకి చేరింది. ఒకరకంగా చెప్పాలంటే జూన్, జూలైలో వర్షపాతం తక్కువ నమోదైందనుకుంటే అంతకుమించిన లోటు సెప్టెంబరులో తేలింది. కాకినాడ జిల్లాలో జూలైలో సరాసరి వర్షపాతం 202.84 మి.మి. నమోదవాల్సి ఉంటే కేవలం 113.58 మి.మి. నమోదైంది. ఆగస్టులో 183.1 మి.మి.కు 127.31 నమోదైంది. సెప్టెంబరులో అయితే అత్యంత తీసికట్టుగా మారింది. ఈ నెలలో జిల్లాలో 181.33మి.మి. వాన కురవాల్సి ఉంటే కేవలం 59.62 మి.మి. కురిసింది. కోనసీమ జిల్లాలో జూలైలో 242.69మి.మి.కు 97.24మి.మి., ఆగస్టులో 232.1మి.మి.కు 122.25మి.మి., సెప్టెంబరులో 201.81కు 79.03మి.మి. మాత్రమే వర్షం కురిసింది. తూ.గో.లో జూలైలో 246.94మి.మి.కు 117.72, ఆగస్టులో 237.02 మి.మి.కు 82.15, సెప్టెంబరులో 170.95కు కేవలం 64.02మి.మి. నమోదైంది.

ఆ జిల్లాలో అన్నీ రెడ్...

కాకినాడ జిల్లాలో 21 మండలాలకు కేవలం అయిదు మండలాల్లోనే నాలుగు నెలల సరాసరిలో సాధారణ వర్షపాతంతో గ్రీన్ జాబితాలో ఉన్నాయి. మిగిలిన 16 మండలాలు లోటు వర్షపాతంతో రెడ్ కేటగిరీలో ఉన్నాయి. గొల్లప్రోలు 5.56 శాతం, కోటనందూరు 19.98% రౌతులపూడి 16.18%, తొండంగి 1.27%,ఏలేశ్వరం 2.67% అదనపు వర్షపాతం నమోదైంది. మిగిలిన మండలాల్లో లోటు వర్షపాతమే మిగిలింది. తూ.గో. జిల్లాలో మొత్తం 19 మండలాలుండగా ఒక్క తాళ్లపూడి మండలం మినహా మిగిలిన అన్నీ లోటు వర్షపాతంతో రెడ్ కేటగిరీలో చేరాయి. ఇక్కడ నాలుగు నెలల సీజన్‌లో 732.1మి.మి. వర్షం కురవాల్సి ఉంటే 778.1మి.మి. వాన పడింది. కోనసీమ జిల్లాలో 22 మండలాలుండగా, అన్నీ లోటు వర్షపాతంతో అల్లాడుతున్నాయి. ఏ ఒక్క మండలంలో కనీసం అదనం వర్షపాతం మాటే లేదు. అత్యధికంగా రాయవరం మండలంలో మైనస్ 54 శాతం లోటు వర్షపాతం రికార్డు అయింది. ఇక రంపచోడవరం ఏజెన్సీలోని 11 మండలాలకుగాను అడ్డతీగల, గంగవరం, మారేడుమిల్లి, వై రామవరం, ఎటపాకలలో అధిక వర్షపాతం నమోదుకాగా, రంపచోడవరం, రాజవొమ్మంగి, వీఆర్ పురం, చింతూరు, కూనవరం, దేవీపట్నంలలో లోటు నమోదైంది.



చివరిరోజు.. చినుకు

వర్షాకాలం సీజన్ ముగింపు రోజు మంగళవారం ఉమ్మడి జిల్లాలోని పలుచోట్ల వాన చినుకులు పడ్డాయి. కాకినాడ జిల్లాలోని పలుచోట్ల భారీ వర్షం కురవగా, కోనసీమలోని అమలాపురం, పరిసర ప్రాంతాల్లోనూ పెద్ద వర్షమే కురిసింది. తూర్పుగోదావరి జిల్లాలో మాత్రం అక్కడక్కడ చిన్నపాటి వాన పడింది.

గోదా'వర్రీ'



పి.గన్నవరం మండలం గంటిపెదపూడి బూరుగులంక నదీపాయ వద్ద పడవపై రాకపోకలు సాగిస్తున్న దృశ్యం



ధవళేశ్వరం బ్యారేజీ వద్ద వరద ప్రవాహం

వరద ఉధృతి

- ధవళేశ్వరం బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక దిశగా - లంకల్లోకి వరద

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

గోదావరి ఉధృతంగా మారింది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మళ్లీ మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేశారు. రెండో ప్రమాద హెచ్చరిక కూడా జారీ చేసే దిశగా ప్రవాహం సాగుతోంది. మంగళవారం రాత్రి 9 గంటలకు బ్యారేజీ నుంచి అంబేడ్కర్ కోనసీమ జిల్లా మీదుగా సముద్రంలోకి 11లక్షల 13వేల 227 క్యూసెక్కుల వరద ప్రవాహం పోతోంది. బ్యారేజీ నీటి మట్టం 12.70 అడుగులకు చేరింది. కిందికి వెళ్లే నీటి ప్రవాహం 13 లక్షల క్యూసెక్కులకు చేరినా, బ్యారేజీ నీటిమట్టం 13.75 అడుగులకు చేరినా రెండో ప్రమాద హెచ్చరిక జారీచేస్తారు. ఇక భద్రాచలం వద్ద సాయంత్రం 5గంటలకు నీటిమట్టం 50 అడుగులకు చేరింది. ఇంకా నెమ్మదిగా పెరుగుతోంది. ఇక్కడ 48 అడుగులకు చేరినపుడు రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. నీటి మట్టం 53 అడుగులకు చేరితే మూడో ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది. ప్రస్తుతం భద్రాచలం నుంచి రాజమహేంద్రవరం అఖండగోదావరిలోకి 12లక్షల 51,999 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోస్ ఉంది. ప్రస్తుతం పోలవరం ఎగువ పాపికొండల ప్రాంతం, పోలవరం దిగువన రాజమండ్రి అఖండ గోదావరి ఉగ్రరూపం దాల్చింది. కాగా రోడ్ కం రైలు బ్రిడ్జి నుంచి సాయంకాలం ఒక మహిళా బస్సులో వచ్చి, గోదావరిలో దూకేసినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. మూడు రోజుల కిందట పుష్కరఘాట్‌లో ఇద్దరు భవానీ భక్తులు స్నానానికి దిగి కొట్టుకుపోయారు. ఈనేపథ్యంలో గోదావరి ఘాట్లలోకి, గోదావరి స్నానానికి ఎవరినీ అధికారులు అనుమతించడంలేదు. కాగా వరద నీటి ఉధృతికి బ్యారేజీ దిగువన ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని లంక భూముల్లోకి వరద ముంచెత్తింది. లంక గ్రామాల్లోకి రాకపోకలూ బంద్ అయ్యాయి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు.



నేటి నుంచి రాజమండ్రి టు తిరుపతికి విమానం

- ఇప్పటికే ప్రతిరోజూ 11 విమానాల రాకపోకలు
- ఢిల్లీ, ముంబాయి, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌కు సర్వీసులు
- 1500 మంది ప్రయాణం

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం మధురపూడి గ్రామంలో ఉన్న రాజమహేంద్రవరం విమానాశ్రయానికి మహర్దశ పట్టింది. బుధవారంనుంచి రాజమహేంద్రవరం - తిరుపతికి విమాన సర్వీసులు ప్రారంభం అవుతున్నాయి. కేంద్ర పౌరవిమానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పలువురు ప్రజాప్రతినిధులు, అధికార్ల సమక్షంలో బుధవారం ఈ సర్వీసును ప్రారంభించనున్నారు. వైమానిక సంస్థ అలయెన్స్ ఎయిర్ ఈ సర్వీసును నిర్వహిస్తోంది. ఇప్పటికే ఈ విమానాశ్రయం నుంచి 11 ఇండిగో విమానాలు న్యూఢిల్లీ, ముంబై, బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్‌కు రాకపోకలు సాగిస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల విమాన ప్రయాణికుల సంఖ్య కూడా బాగా పెరిగింది. రోజుకు సుమారు 750మంది ఇతర ప్రాంతాలకు వెళుతున్నారు మరో 750మంది రాజమండ్రికి వస్తున్నారు. మొత్తం 1500 మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం వెళ్లి సాయంత్రానికి ఇంటికి చేరుకునే అవకాశం దీంతో మరింత చేరువైంది. ఎప్పటినుంచో శ్రీవేంకటేశ్వరస్వామి కొలువైన తిరుపతికి భక్తులతోపాటు అనేక మంది విమాన సర్వీసును కోరుతున్నారు. అది ఇప్పటికి నెరవేరింది. ఇటీవల విమానాశ్రయాన్ని మరింత విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. కార్గో సేవలు కూడా బాగా విస్తృతం కానున్నాయి.

ఆటో డ్రైవర్లకు భరోసా

- జిల్లాలో వాహనమిత్రకు 8,516 దరఖాస్తులు

అమలాపురంరూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు భరోసాకల్పిస్తూ కూటమిప్రభుత్వం వాహన మి త్ర పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆటో, క్యాబ్ వాహన యజమానులే డ్రైవర్లుగా ఉన్నవారికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. వాహనమిత్ర పథకం కింద ఒక్కొక్కరికీ రూ.15వేల చొప్పున అందించనున్నారు. ఇప్పటికే అర్హులైన లబ్ధిదారులనుంచి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని సచివాలయాల వారిగా ఆటో, క్యాబ్‌డ్రైవర్లు నుంచి 8516 దరఖాస్తులను స్వీకరించారు.

అమలాపురం మండలంలో అత్యధికంగా..

వాహనమిత్ర పథకం కింద జిల్లావ్యాప్తంగా 8516 దరఖాస్తులు అందాయి. వాటిలో అత్యధికంగా అమలాపురం రూరల్ మండలంనుంచి 514 దరఖాస్తులు అందాయి. ఆ తర్వాత కొత్తపేట మండలంలో 461, రావులపాలెం మండలంలో 446, ఆత్రేయపురంలో 413, పి.గన్నవరంలో 404 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అత్యల్పంగా ముమ్మిడివరం అర్బన్‌లో 131, అమలాపురం అర్బన్‌లో 185మంది దరఖాస్తు చేసుకున్నారు.

ఉచిత బస్సు ప్రయాణం నుంచి ఊరట..

కూటమి ప్రభుత్వం సూపర్-6 పథకాల అమలులో భాగంగా స్త్రీపథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించారు. దీంతో తాము ఉపాధిని కోల్పోయామని ఆటోడ్రైవర్లు దశలవారీ ఆందోళనకు దిగారు. తక్షణం స్పందించిన ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీమేరకు వాహనమిత్ర పథకాన్ని ప్రవేశపెడుతున్నట్టు ప్రకటించింది. దీంతో వారు ఆందోళన విరమించారు.

పారదర్శకంగా వాహనమిత్ర

జిల్లాలో వాహనమిత్ర పథకాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. దీంతో సచివాలయ సిబ్బంది లాగిన్‌లోకి వచ్చిన ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలించి ఈకేవైసీ ప్రక్రియను సైతం పూర్తిచేశారు. జిల్లాలోని మండల పరిషత్ కార్యాలయాల ద్వారా కలెక్టర్ ఆమోదానికి 8516 దరఖాస్తులు చేరుకున్నాయి. వాటిని పరిశీలించి ఆమోదిస్తే ఒక్కొక్కరికీ రూ.15వేల చొప్పున ప్రభుత్వం అందించనుంది. దసరా కానుకగా అక్టోబరు 4న వాహనమిత్ర పథకాన్ని అమలుచేసే అవకాశం ఉందని ఉన్నతాధికారులు చెప్తున్నారు. కూటమి ప్రభుత్వం కానుకతో ఆటోడ్రైవర్ల ఆనందానికి అవధుల్లేవు.

నేడు బాలయోగి జయంతి

- ఎంపీ హరీష్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు

అమలాపురం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి జయంతి వేడుకలు జిల్లావ్యాప్తంగా బుధవారం నిర్వహించనున్నారు.అమలాపురం ఎంపీ, బాలయోగితనయుడు గంటి హరీష్‌మాధుర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అమలాపురం పట్టణంలోని కలెక్టరేట్ పక్కనే ఉన్న జీఎంసీ బాలయోగి ఘాట్‌లో హరీష్‌బాలయోగితోపాటు జిల్లానలుమూలలనుంచి వచ్చే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి చెందిన నాయకులు హాజరై బాలయోగికి ఘనంగా నివాళులర్పిస్తారు. ఉదయం బాలయోగి స్వగ్రామమైన ఎదుర్లంకనుంచి ఎంపీ హరీష్‌మాధుర్ ఆధ్వర్యంలో కార్యక్రమాల నిర్వహణ ప్రారంభమవుతుంది.

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

ఫలపుష్ప ప్రదర్శన ఏర్పాట్లపై సమీక్ష



సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు

యానాం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): యానాంలో 2026జనవరి 6 నుంచి 8వరకు జరిగే ఫలపుష్ప ప్రదర్శనకు సంబంధించిన ఏర్పాట్లపై పరిపాలనాధికారి కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. పరిపాలనాధికారి అంకిత్‌కుమార్‌ను తొలిసారిగా ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కలవడంతో పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం జరిగిన సమీక్షా సమావేశంలో ఫల పుష్ప ప్రదర్శన ఏర్పాట్లపై చర్చించారు. ఫల పుష్ప ప్రదర్శన నాలుగు రోజులు నిర్వహించేలా ఏర్పా ట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈప్రదర్శనను విజయవంతంగా నిర్వహించడానికి మూడు నెలల ముందుగానే అవసరమైన పూల మొక్కలను పెంచే చర్యలు చేపట్టాలని, ఇతర రాష్ట్రాల నుంచి ప్రత్యేక రకాల పూలమొక్కలు సేకరించాల్సిన అవసరం ఉందని ఆర్‌ఏ అంకిత్ కుమార్‌కు వివరించారు. కార్యక్రమంలో ప్రజాపనులశాఖ, వ్యవసాయశాఖ, విద్యాశాఖ, విద్యాశాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంపీపీ పదవికి సత్యవేణి రాజీనామా

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి ఎంపీపీ పదవికి తన వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు. సోమవారం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు రాజీనామా పత్రాన్ని ఆమె అందజేశారు. ఎంపీటీసీగా కొనసాగుతానని వినతిపత్రంలో పేర్కొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ పోటీలు



గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో హోరాహోరీగా తలపడుతున్న క్రీడాకారులు

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి జడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో నాగులపల్లి లక్ష్మీనారాయణ మెమోరియల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలో మూడవ రోజు మంగళవారం హోరాహోరీగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 12 జట్ల మధ్య పోటీలు నువ్వా: నేనా అన్న రీతిలో జరిగి క్రికెట్ అభిమానులను అలరించాయి. నాగులపల్లి రాజు ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీలు అక్టోబరు ఒకటో తేదీన ఫైనల్స్ కు చేరనున్నాయి. పోటీల అనంతరం విన్నర్స్‌కు బహుమతి ప్రదానం జరుగుతుందని రాజు తెలిపారు. ప్రధమ బహుమతిగా రూ.20వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు ఇవ్వనున్నట్టు ఆయన ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



షేక్ నాగూర్ మీరా(పాత చిత్రం)

పి.గన్నవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పొట్ట కూటి కోసం పొరుగు రాష్ట్రం నుంచి వచ్చి.. ఇంటింటికి వెళ్లి సాంబ్రాణి పొగ వేసి దిష్టి నిమ్మకాయలు కట్టి కుటుంబాన్ని పోషించుకునే ఓ నిరుపేదను లారీ రూపంలో మృత్యువు కబలించింది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలోని ఏనుగుపల్లి ఏటిగట్టు సెంటర్ కల్వర్టు వద్ద రాజోలు వైపు నుంచి వస్తున్న సిమెంట్ లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివి. నల్గొండ జిల్లా నేరేడుచర్ల మండలం బక్కాయిగుడెం శివారు మేడారం గ్రామానికి చెందిన షేక్ నాగూర్‌మీరా(45) కొన్నాళ్లగా పి.గన్నవరం శివారు డీఎస్‌పాలెంలో నివాసం ఉంటున్నాడు. సమీప షాపుల్లో, ఇంటింటికి తిరిగి సాంబ్రాణి పొగ వేసి దిష్టి నిమ్మకాయలు కట్టి జీవనం సాగిస్తున్నాడు. మంగళవార సైకిల్‌పై వెళ్లి పి.గన్నవరం సెంటర్‌లో దుకాణాలకు సాంబ్రాణి పొగవేసి నిమ్మకాయలు కట్టాడు. అనంతరం పి.గన్నవరంలోని కె.ఏనుగుపల్లి ఏటిగట్టు సెంటర్ నుంచి త్రీరోడ్డు సెంటర్ వైపు సైకిల్‌పై వస్తున్న సమయంలో రాజోలు వైపు నుంచి వస్తున్న సిమెంట్ లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దీంతో నాగూర్‌మీరా తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య జిబాషా ఉన్నారు. మీరా బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు. మలికిపురంలో సిమెంట్ లోడు దించి లారీ తిరిగి వస్తుండగా ఈఘటన జరిగిందని పోలీసులు తెలిపారు.

దుర్గాదేవిగా దర్శనం



అంబాజీపేట మండలం మాచవరం ఇటికాలమ్మ, మహాలక్షమ్మ అమ్మవారి ఆలయంలో కొబ్బరి కాయలతో ప్రత్యేక అలంకరణలో కనకదుర్గమ్మ మండపం

అమలాపురం టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ఎనిమిదో రోజు దుర్గమ్మ పలు ఆలయాల్లో దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమలాపురం శ్రీదేవి మార్కెట్ సెంటర్‌లోని శ్రీదేవి అమ్మవారు శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీవైష్ణవి కనకదుర్గమ్మ భక్తులకు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని కల్యాణ దుర్గమ్మను ర్యాలి పెరుమాళ్లస్వామి-పుణ్యవతి దంపతులు, కుమార్తెలు భవిష్య జయంతిక, మోక్షితశాన్వికలు అమ్మవారిని దుర్గాదేవిగా విశేష అలంకారం చేయించారు. ఈదరపల్లి వంతెన వద్ద దుర్గాదేవి అలంకరణను తిలకించేందుకు భక్తులు బారులు తీరారు. ఇందుపల్లి శ్రీ బాలభక్త గణపతి సేవాసంఘం ఆధ్వర్యంలో సువాసినిపూజ నిర్వహించారు. తొమ్మిది మంది ముత్తయిదువులను కనకదుర్గలుగా కొలుస్తూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాణి కామేష్, తనికెళ్ల హయగ్రీవశర్మ ఆచార్య బ్రహ్మత్వంలో ఉపాధ్యాయుల సుబ్రహ్మణ్యశర్మ, సాయిలక్ష్మి దంపతులు నవదుర్గలను పూజించారు.

ఘనంగా చండీ హోమాలు, అభిషేకాలు

అల్లవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): అల్లవరం విజయకనకదుర్గ ఆలయం వద్ద ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు గమిడి సూరిబాబు, వెదుళ్లపల్లి ఆదివీరవెంకటసత్య సూర్యనారాయణమూర్తి, సీహెచ్ అప్పలరాజు, కంకిపాటి దుర్గారావు, అరిగెల పుల్లయ్యనాయుడు కర్తలుగా వేదపండితులు మంగళంపల్లి పాండురంగ విఠల్ ఆధ్వర్యంలో దుర్గాచండీ హోమం జరిగింది. గోడితిప్ప ఆలయం వద్ద పోచిన పెద్ది సాయిబాబు బ్రహ్మత్వాన గణపతి హోమం చండీ, రుద్ర హోమాలు జరిగాయి. బెండమూర్లంక, కొమరగిరిపట్నం, మొగళ్లమూరి, అల్లవరం, బోడసకుర్రు, డి.రావులపాలెం, యెంట్రుకోన, కోడూరుపాడు, గోడిలంక పరిసర గ్రామాల్లో విజయకనకదుర్గకు కుంకుమ పూజలు, అభిషేకాలు జరిగాయి. ఆలయాల వద్ద అన్నసమారాధనలు నిర్వహించారు.

దుర్గాదేవికి పూజలు

ముమ్మిడివరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం పళ్లవారిపాలెంలో దుర్గాదేవిగా విజయదుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. చినకొత్తలంక గ్రామంలోని శ్రీపట్టాభిరామస్వామివారి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారిని వివిధ రంగుల గాజులతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు జరిపించారు.

దుర్గాదేవిగా కనకదుర్గమ్మ

పి.గన్నవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): గంటిపెదపూడిలో శ్రీమసేనమ్మ శ్రీదుర్గాదేవిగా, పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెంలో శ్రీకనకదుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. తాటికాయలవారిపాలెంలో సోమవారం రాత్రి ఆలయ ప్రధాన అర్చకులు పుల్లేటికుర్తి ఫణి నేతృత్వంలో దుర్గా మల్లేశ్వరస్వామివారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పి.గన్నవరం, మానేపల్లి, నరేంద్రపురం, ఉడిమూడి, ముంగండ, మొండెపులంక, లంకలగన్నవరం, వాడ్రేవుపల్లి, కుందాలపల్లి తదితర గ్రామాల్లోని శ్రీకనకదుర్గ ఆలయాల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు, మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు.

అమ్మవారికి పంచామృతాభిషేకాలు

అంతర్వేది, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): అంతర్వేది భవానీ సైకిల్ షాపు సెంటర్‌లో అమ్మవారికి పంచామృతాలతో భక్తులు అభిషేకాలు చేశారు. అనంతరం మోరి గ్రామానికి చెందిన మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేశారు. సాయంత్రం మురళీకృష్ణ కోలాటం, భజనాకీర్తనలు జరిగాయి. అంతర్వేది దిండకొడప వద్ద వెలసి ఉన్న కనకదుర్గమ్మవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

రాజరాజేశ్వరిదేవిగా వాసవీమాత

అంబాజీపేట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ వద్ద ఉన్న శ్రీ వాసవీకన్యకా పరమేశ్వరి అమ్మవార్ని రాజరాజేశ్వరిదేవిగా అలంకరించారు. అనంతరం అర్చకులు అమ్మవార్కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబాజీపేటసంత మార్కెట్‌లో ఉన్న శ్రీవిజయకనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంబాజీపేట విజయభేతాళస్వామి, పక్షులరావిచెట్టు వద్ద అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాచవరం ఇటికాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లోమండపాన్ని కొబ్బరికాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవార్కి పూజలు నిర్వహించారు. పలు ఆలయాల వద్ద అన్నసమారాధనలు చేశారు.

అమ్మవారి ఆలయాల్లో పూజలు

రాజోలు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): సోంపల్లిలో తాటికాయల అయ్యప్పనాయుడు స్వగృహంలో మంగళవారం అమ్మవారికి పూజలు ఘనంగా నిర్వహించారు. తాటికాయల రామలక్ష్మి ఆధ్వర్యంలో లలితా పారాయణం, అమ్మవారికి భజనా, కీర్తనలు జరిగాయి. కార్యక్రమంలో కోళ్ల రమా, చిట్నీడి దుర్గ, నర్సవేణి, ఆదిలక్ష్మి, పద్మకుమారి, గోటేటి కమల, పూర్ణ, మౌనిక, అక్కిరెడ్డి కుమారి పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు

యానాం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): యానాం శివారు గిరియంపేటరోడ్డులోని పాలకనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు రాయప్రోలు కామేశ్వరశర్మ నేతృత్వంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గోపూజ, కాత్యాయనీ పూజ, పూజలు నిర్వహించారు. గోపాల్‌నగర్‌లోని శారదాదేవి ఆలయంలో, శివాలయం ప్రాంగణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవార్లు దుర్గాదేవి అలంకరణలో, త్యాగరాజవీధిలోని లలితాదేవి ఆలయంలో మహిషాసురమర్దిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

శారదాదేవిగా మావుళ్లమ్మ

కాట్రేనికోన, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన గ్రామదేవత మావుళ్ళమ్మ మంగళవారం గారెల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆణివిళ్ళ ఫణికాంత్‌శాస్త్రి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు ఆణివిళ్ళ సాయిబాబా, గ్రంధి నారాయణమూర్తి, గ్రంధి రాంప్రసాద్, గ్రంధి నానాజీ, సంసాని వరప్రసాద్, యల్లమిల్లి రమేష్, సుంకర పవిత్ర,చెరుకు కృష్ణ, చెరుకు బాపిరాజు, గ్రంధి శ్రీను, తాతపూడి గోపి, మహిళలు పాల్గొన్నారు.

హోంమంత్రిని కలిసిన ఏఎంసీ చైర్మన్



రాజోలు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలో హోంమంత్రి అనితను రాజోలు ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి మంగళవారం మర్యాద పూర్వకంగా ఆమె స్వగృహంలో కలుసుకున్నారు. అనితకు వెంకటలక్ష్మి పుష్పగుచ్ఛం అందజేసి దుశ్శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వెంకటలక్ష్మికి హోంమంత్రి అనిత దుశ్శాలువా కప్పి సత్కరించారు. బొక్కా పృథ్వీ, గుబ్బల నాగభూషణం, భైరిశెట్టి గణేష్, నాగిరెడ్డి గోపి, పితాని సూరిబాబు, ఉల్లంపర్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పంపిణీ




అమలాపురం టౌన్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి 15నెలల కాలంలో అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 331మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.2.73కోట్లు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి అందించినట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ శాఖ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీ, భాస్కర్ల రామకృష్ణ, బొర్రా ఈశ్వరరావు, ఆకుల బుజ్జి, పొలమూరి ధర్మపాల్, బడుగు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడు అరెస్టు

అంతర్వేది, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిపల్లిపాలెంలో తొమ్మిది నెలల క్రితం నమోదైన అత్యాచార కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్టు రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ తెలిపారు. తనను బలాత్కారం చేశాడని అప్పట్లో మహిళ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న నిందితుడు స్వగ్రామానికి వచ్చినట్టు అందిన సమాచారంతో అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

రేపు మంత్రి రామానాయుడు పర్యటన

మలికిపురం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): జనవరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అక్టోబరు2న రాజోలులో రూ.10కోట్లతో నిర్మించే గ్రోయిన్స్ పనులకు శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలి పారు. ఆ రోజున శంకరగుప్తం డ్రెయిన్‌ను పరిశీలిస్తారని, రైతులతో ముఖాముఖి సమావేశం ఏర్పాటు చేశామన్నారు. డ్రెయిన్ డ్రెడ్జింగ్‌కు ముందు పరిస్థితులు రైతులు ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తామన్నారు.















ఆర్ఎస్ఎస్ శత జయంత్యుత్సవాలు


ఎమ్మెల్సీ రాజశేఖర్‌ను సన్మానిస్తున్న ఆర్ఎస్ఎస్ ప్రతినిధి సలాది శ్రీనివాసరావు

ఐ.పోలవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): గుత్తెనదీవి సాయిరాం విద్యానికేతన్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా కాషాయ ధ్వజానికి పూజలు నిర్వహించారు. అనంతరం దుర్గాదేవి, భారతమాత, మాధవ్ సదాశివరావు, గోల్వాల్కర్ గురూజీ, డాక్టర్ కేశవ్ బలిరాం హెగ్డేవార్ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీని సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ లంకలపల్లి దుర్గాదేవిమునిరాజు, ఓలేటి సత్యనారాయణ, పెన్మెత్స గోపాలకృష్ణంరాజు, సొసైటీ చైర్మన్ పెంట రవిప్రసాద్, నరహరిశెట్టి రాంబాబు, నీటి సంఘం చైర్మన్ చోడిశెట్టి నాగబాబు, రెల్లు గంగాధరం, సలాది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50వేలు విరాళం

అంతర్వేది, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు ఖండవల్లికి చెందిన భూపతిరాజు పాండురంగరాజు-వరలక్ష్మి దంపతులు రూ.50,116 విరాళం అం దించారు. తొలుత వారు స్వామివార్ని దర్శించుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి స్వామి వారి చిత్రపటం, ప్రసాదం దాతకు అందించారు.

తీరప్రాంత రైతులకు న్యాయం చేస్తాం: ఎమ్మెల్యే


శంకరగుప్తం డ్రెయిన్‌లో పడవపై వెళ్లి చనిపోయిన కొబ్బరిచెట్లను అధికారులతో కలసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మలికిపురం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): శంకరగుప్తం డ్రెయిన్ పరివాహక గ్రామాల్లోని రైతులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మంగళవారం శంకరగుప్తం పరిధిలోని 12కిలోమీటర్ల మేర పడవపై అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి వెళ్లి చనిపోయిన కొబ్బరితోటలను పరిశీలించారు. సముద్ర ముఖ ద్వారం గోగన్నమఠం డ్రెయిన్ ముఖ ద్వారం వరకు వెళ్లి పరిస్థితిని అంచనా వేశారు. శంకరగుప్తం డ్రెయిన్ రాజోలు నియోజకవర్గానికి దుఃఖదాయనిగా వెళ్లిందన్నారు. ఈప్రాంతంలో రైతులు డ్రెయిన్ డ్రెడ్జింగ్ చేయకపోవడం వల్ల తీవ్ర నష్టానికి గురయ్యారన్నారు. డ్రెయిన్ పారుదల సరిలేక నియోజకవర్గంలో ఆయకట్టు అంతా దెబ్బతిందన్నారు. ఇవన్నీ సరిచేయడానికే అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈఈ కిశోర్, డీఈఈలు నాగార్జున, శ్రీనివాస్, ఎంపీపీ ఎంవీ సత్యవాణి, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ శ్రీనివాస్, దిరిశాల బాలాజీ, పెదకాపు, పినిశెట్టి బుజ్జి, చాగంటి స్వామి, యుగంధర్, ముప్పర్తి నాని, యెనుముల నాగు, తహశీల్దార్లు శ్రీనివాసరావు, అడబాల నాని, యెనుముల బాబ్జి, సీఐ నరేష్‌కుమార్, ఎస్ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.





పెరుగుతున్న గోదావరి.. పడవలపై రాకపోకలు



పి.గన్నవరం గంటిపెదపూడి వద్ద పడవలోకి కొబ్బరి కాయలను లోడు చేస్తున్న రైతులు, ముమ్మిడివరం:లంకాఫ్ రాణేలంక శివారు అంబేడ్కర్‌నగర్‌లో వరదనీరు

పి.గన్నవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వే వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. స్థానికులు నాటు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. గంటిపెదపూడివద్ద బూరుగులంక నదీపాయపై పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక, ఉడిమూడిలంక గ్రామస్తులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. మానేపల్లి శివారు శివాయిలంకలో రోడ్డుపైకి వరదనీరు రావడంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాగుల్లంక ఏటిగట్టు దిగువన రాయిలంక, పుచ్చల్లంక ప్రాంతాల్లో వరదనీరు సీసీ రోడ్లపైకి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా గ్రామాలైన అనగార్లంక, పెదమల్లంక గ్రామస్తులు నాటుపడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. బూరుగులంకరేవు, పుచ్చల్లంక రేవులు వద్ద వ్యవసాయ ఉత్పత్తులు, నిత్యావసరాలు ఇవతలి ఒడ్డుకు తరలిం చడానికి రైతులు నానావస్థలు పడుతున్నారు. ప్రత్యేకాధికారి డీఆర్‌డీఏ పీడీ టీ.జయచంద్రగాంధీ, తహశీల్దార్ పి.శ్రీపల్లవిలు గంటిపెదపూడి, మానేపల్లి శివారు శివాయిలంక, కనకాయలంక ప్రాంతాలను పరిశీలించి రెవెన్యూ సిబ్బందికి సూచనలు జారీ చేశారు. డిప్యూటీ తహశీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ డాంఫే, వీఆర్వో భగవాన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిలకడగా వరద..

ముమ్మిడివరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువన వరద ఉధృతిగా ప్రవహిస్తున్నప్పటికీ మండలంలోని లంక గ్రామాల్లో వరదనటి ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. లంక గ్రామాల్లోని లోతట్టు

● నీట మునిగిన కాజ్‌వేలు, రహదారులు

భూములు వరద నీటిలోనే ఉన్నాయి. వరద నీటి ప్రవాహ వేగం అంతగా లేనప్పటికీ వరద ముంపు మాత్రం కొనసాగుతోంది. సముద్రం నీరు వెనక్కు వెళ్లడంతో ఎప్పటికప్పుడు వరదనీరు సముద్రంలో కలిసి పోవడంతో పెద్దగా ముంపు బెడద లేదు. పళ్లవారిపాలెం-గురజాపులంక సీసీ రోడ్డు కూనాలంక మలుపు నుంచి గురజాపులంక వరకు వరద ముంపులో ఉంది. కూనాలంక రామాలయం వద్ద వరదనీరు రోడ్డును ఆనుకుని ప్రవహిస్తోంది. ఇంటర్నల్ రోడ్లు మాత్రం వరద నీటిలో ఉన్నాయి. లంకాఫ్‌రాణేలంక మత్స్యకార కాలనీ శివారు అంబేడ్కర్ నగర్‌లో రోడ్డుపై వరదనీరు ప్రవహిస్తూనే ఉంది. లంకాఫ్ గేదెల్లంకలో కూడా వరదనీటి ప్రవాహం కొనసాగుతోంది. ప్రత్యేకాధికారి ఎం.రాంబాబు, తహశీల్దార్ టీ.సుభాష్, ఎంపీడీవో దీక్షితులు మంగళవారం లంకాఫ్ రాణేలంక, గురజాపులంకలో పర్యటించారు. వరద విధులు నిర్వహించే అధికారులు గ్రామస్తులతో సమావేశం నిర్వహించి ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. లంక పొలాల్లోకి వెళ్లే రైతుల కోసం లంకాఫ్ రాణేలంక, గురజాపులంక రేవుల్లో ఇంజను బోట్లు ఏర్పాటుచేశారు. భద్రాచలంలో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో అధికారులు స్థానికంగా ఉండి పరిస్థితులను సమీక్షించాలని ఆదేశించారు. వరద ఉధృతిని బట్టి వృద్ధులు, గర్భిణులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూము కొనసాగుతోంది.

శంఖం పూరింపు



పి.గన్నవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పి.గన్నవ రం శివారు తాటికాయల వారిపాలెం శ్రీకనకదుర్గ ఆలయ సన్నిధిలో మంగళ వారం రాజమహేంద్రవరం కమాండెంట్ కొండా నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులు శంఖారావాన్ని పూరించారు. ఆలయ కమిటీ సభ్యులు వారికి స్వాగతంపలికి ప్రసాదం అందించారు.

సుబ్బాలమ్మకు పసుపు కొమ్ములతో విశేష అలంకరణ



అమలాపురం, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలోని శ్రీసుబ్బాలమ్మ అమ్మవారికి మంగళవారం పసుపు కుంకుమలతో విశేష అలంకరణ చేశారు. అమెరికాకు చెందిన సలాది వెంకటసుబ్బారావు-యుగసంధ్య కుమారులు సాత్విక్‌నాయుడు, సుభాష్‌నాయుడుల సహకారంతో సుబ్బాలమ్మవారిని పసుపుకొమ్ములతో అలంకరణ చేశారు. భక్తులు భారీసంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. మంగళవారం నుంచి గురువారం వరకు అమ్మవారు పసుపు కొమ్ములతోనే ప్రజలకు దర్శనభాగ్యం కల్పిస్తారని సుబ్బాలమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ పెద్దిరెడ్డి సాయిపుల్లయ్యనాయుడు తెలిపారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పి.గన్నవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్వస్థ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వాడ్రేవుపల్లి సర్పంచ్ పత్తిపాటి ఉమామహేశ్వరి కోరారు. వాడ్రేవుపల్లిలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం వైద్య సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెల్లిబోయిన గంగాభవాని, పంచాయతీ కార్యదర్శి మంగెన వెంకటేశ్వరావు, పీహెచ్ఎన్ ఎంఎస్ కుమారి, ఎంపీహెచ్‌వో ఎం.రాజశేఖర్, నాయకులు పత్తిపాటి వెంకన్నబాబు, బొక్కా వెంకటరమణ, దేవళ్ల ఆనంద్‌కుమార్, దోనిపాటి నరసింహమూర్తి, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ నాయకుల నిరసన

అమలాపురం రూరల్, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేయద్దంటూ వైసీపీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఈదరపల్లి వంతెన వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన పీపీపీ విధానాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, రాజోలు, పి.గన్నవరం వైసీపీ కోఆర్డినేటర్లు గొల్లపల్లి సూర్యారావు, గన్నవరపు శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, జిల్లాపరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరి దేవి, జడ్పీటీసీ పందిరి శ్రీహరి, వైసీపీ సోషల్ మీడియా కార్యదర్శి ఉండ్రు బాబ్జి, సరెల్ల రామకృష్ణ, ఉండ్రు వెంకటేష్, నక్కా సంపత్‌కుమార్, మట్టా శైలజ, ఈతకోట శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో పేదలకు మేలు

అల్లవరం, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ తగ్గింపు సంస్కరణలతో పేద, మధ్య తరగతి వర్గాలకు నిత్యావసర వస్తువుల ధరలు తగ్గి మేలు జరుగుతుందని, టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు అన్నారు. జీఎస్టీ తగ్గింపుపై అల్లవరం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అధికారులు, వివిధ పార్టీల రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కొనుకు గౌతమీ, తహశీల్దార్ ఎంవీవీ నరసింహారావు, ఎంపీడీవో గౌరీకుమారి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, మండల బీజేపీ అధ్యక్షుడు కట్టా నారాయణమూర్తి, పచ్చిమాల ఏడుకొండలు, కంకిపాటి గోపాలకృష్ణ, కంకిపాటి వీరబాబు, కొల్లు విష్ణుమూర్తి, ముత్యాల బాబీ, సాధనాల నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ ద్వారా రైతులకు మరిన్ని సేవలు

అంబాజీపేట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ చైర్‌పర్సన్ అరిగెల సూరిబాబు అన్నారు. అంబాజీపేటసొసైటీ కార్యాలయంలో మహాజన సభ చైర్మన్ సూరిబాబు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా చైర్మన్ సూరిబాబు మాట్లాడుతూ పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సహకారంతో సొసైటీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానన్నారు.నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, ఏవో ధర్మప్రసాద్, ముత్యాల జమీలు, కొర్లపాటి కోటబాబు, అరిగెల బలరామమూర్తి, దొమ్మేటి సత్యమోహన్, ఖైపాల తాతాజీ, సుంకర బాలాజీ, డైరక్టర్లు పితాని సత్యప్రసాద్, ఉందుర్తి సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

సువాసినీల పూజ

పి.గన్నవరం, సెప్టెంబరు30(ఆంధ్రజ్యోతి): మానేపల్లి శివారు భవానీనగర్ గ్రామంలో ఉన్న శ్రీకనకదుర్గమ్మతల్లి ఆలయంలో మంగళ వారం సువాసిని పూజలు నిర్వహించారు. వేదపండితుల వేదమంత్రాల నడుమ సౌభాగ్యాన్ని, సిరి సంపదలను కలుగజేయాలని కోరుతూ భక్తిశ్ర ద్ధలతో మహిళలు కుంకుమపూజలు చేశారు. అనంతరం 200మంది మహిళలకు పెచ్చెట్టి భాస్కరరావు, దొంగ వెంకటేశ్వరరావు దంపతులు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటా

పి.గన్నవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి మండలం విలసగ్రామం కిరాణా షాపులో మంగళవారం సాయంత్రం జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో దంపతులు మృతి చెందడంపై ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకుంటామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. గాయపడిన వారి కుమారుడు ప్రదీప్‌కు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.అలాగే పి.గన్నవరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో షేక్ నాగూర్‌మీరా మృతి చెందడం బాధాకరమన్నారు.



ఆర్ఏను కలిసిన జీఎన్ నాయుడు



యానాం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): పరిపాలనాధికారి అంకిత్‌కుమార్‌ను రీజెన్సీ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ జి.ఎన్.నాయుడు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం యానాంలో పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వ పరంగా అన్ని స్థాయిల్లో తీసుకోవాస్సిన చర్యలు, రీజెన్సీ సిరామిక్స్‌టైల్స్ పరిశ్రమ పునఃప్రారంభంపై రీజెన్సీ యంత్రాంగానికి చేయూత తదితర అంశాలను ఆర్ఏకు వివరించారు.

సహకార సంఘాల్లో డిపాజిట్లు పెంచేలా కృషి చేయాలి

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో డిపాజిట్లు పెంచేలా రైతులు, సభ్యులు కృషి చెయ్యాలని సొసైటీ చైర్మన్లు కోరారు. మంగళవారం చైర్మన్లు ఈదరపల్లి వెంకటసత్యనారాయణరాజు(శ్రీను రాజు), ఆకేటి పెద్ద అధ్యక్షతన ఎన్.కొత్తపల్లి, భీమనపల్లి సహకార సంఘాల్లో మహాజనసభలు నిర్వహించారు. డీసీసీబీ సూపర్‌వైజర్ నరేష్ రుణాలు, ఇతర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సభలో సొసైటీ పర్సన్లు బీర సత్యనారాయణ, అరదాని ధర్మారావు, బేసే గోపీకృష్ణ, సీతంవేలు కె.శ్రీనివాసరాజు, పోలిశెట్టి దుర్గాప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.



సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా
దసరా ఉత్సవాలు



- ప్రత్యేక ఆకర్షణగా చెడీతాలింఖానా
- రేపు అమలాపురంలో దసరా ఉత్సవ ప్రదర్శనలు
- ఉభయ రాష్ట్రాల నుంచి తరలిరానున్న వీక్షకులు
- భారీ భద్రతా ఏర్పాట్లు: ఎస్పీ రాహుల్ మీనా



చెడీ తాలింఖానాలో భాగంగా పొట్టపై కత్తితో కొబ్బరికాయ నరుకున్న దృశ్యం (పాత చిత్రం)

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

అమలాపురంలో జరిగే ఊరేగింపులో ఒక్కో వీధికి ఒక్కో ప్రత్యేక చరిత్ర ఉంది. 1835వ సంవత్సరంలో బ్రిటీష ప్రభుత్వ అనుమతి పొంది కొంకాపల్లిలో దసరా ఉత్సవాలను ప్రారంభించారు. 190వ విజయదశమి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. కొంకాపల్లిలో ఐరావతం, రాజహంస వాహనాలపై అమ్మవారి ఉత్సవమూర్తులను ఉంచి భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. మహిపాల వీధిలో అబ్బిరెడ్డి రామదాసు చెడీతాలింఖానా 1856లో ప్రారంభమైంది. శ్రీరాజహంస వాహనంపై భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. విజయదశమిని ఘనంగా నిర్వహించేందుకు యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. కొంకాపల్లి-మహిపాల వీధుల ఆధ్వర్యంలో కొన్ని వీధుల్లో వాహనాలను ఊరేగించడం, మరి కొన్ని వీధుల్లో వీరత్వానికి ప్రతీకగా నిలిచే చెడీతాలింఖానా నిర్వహిస్తారు. నల్లా వీధి, గండు వీధి, రవణం వీధి, రవణం మల్లయ్య వీధి, శ్రీరామపురం వీధిలో ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నాయి. ప్రతిఏటా దసరా ఉత్సవాల ముగింపు రోజున భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. దేశంలోనే ప్రత్యేకత సంతరించుకున్న మైసూర్ తరహాలో జరిగే దసరా ఉత్సవాలను తిలకించేందుకు రెండు కళ్లు చాలవంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. కర్రలు, కత్తులు, పటాకత్తులు, బళ్లాలు, లేడి కొమ్ములు, అగ్గిబరాటాలు, సరిగమలు, బంతుల తాళ్లు, కత్తి-డాలు, అగ్గి తాళ్లు వంటి వాటితో ఒళ్లు గగుర్పాటు కలిగించే విన్యాసాలను చెడీతాలింఖానాలో ప్రధానంగా నిర్వహిస్తారు. మహిపాల, కొంకాపల్లి, గండు వీధులు ఈ కార్యక్రమానికి ప్రత్యేక వేదికలుగా నిలుస్తాయి. కళ్లకు గంతలు కట్టుకుని పొట్టలపై కూరగాయలు, కొబ్బరికాయలు, వంటివి కత్తులతో ఒక్క వేటుకు నరకడం ప్రత్యేక ఆకర్షణ.

మరోవైపు ఊరేగింపుల నేపథ్యంలో భారీ భద్రతా చర్యలు చేపట్టారు. వందల మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎస్పీ రాహుల్ మీనా పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నట్టు అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. ఉత్సవ కమిటీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు, కమిటీలు సహకరించాలని పోలీసులు కోరారు.



ప్రాచీన సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే చెడీతాలింఖానా సంబరాలకు కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం వేదిక కానుంది. దసరా వచ్చిందంటే చాలు అమలాపురంలో జరిగే శరన్నవరాత్రుల సంబరాలు ప్రతి ఒక్కరికీ గుర్తొస్తాయి. వీటిని తిలకించేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచీ జనం తరలివస్తారు. ఒళ్లు గగుర్పొడిచే చెడీతాలింఖానా విన్యాసాలతో కర్ర, కత్తి సాములతో పాటు అగ్గిబరాటాలు తిప్పడం ఈ ఉత్సవాల్లో ప్రత్యేకత. దసరాకు కోనసీమలోని వివిధ గ్రామాలతో పాటు అమలాపురంలో విజయదశమి పర్వదినమైన గురువారం జరిగే ఊరేగింపులు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.



రవణం వీధి మహిషాసురమర్దిని అమ్మవారి వాహనం

రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు

అమలాపురంలో జరిగే శరన్నవరాత్రులకు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు ఉంది. సుమారు 190 ఏళ్లపైనే చరిత్ర ఉంది. వంశపారం పర్యంగా పట్టణ వీధుల్లో వివిధ ప్రాం తాల వారు విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్సవ కమిటీలు ఆయా వీధుల్లో ప్రసిద్ధి చెందిన వాహనాల్లో దేవతామూర్తులను అలంకరించి ఊరేగిస్తారు. సాంస్కృతిక ప్రదర్శనలు, బ్యాండు మేళాలు, గారడీలు, కోయ డాన్సులు అలరిస్తాయి. ఇందు కోసం భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

సత్యం వాసంశెట్టి ఫౌండేషన్‌కు విరాళం

కె.గంగవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్న సత్యం ఫౌండేషన్‌కు కె.గంగవరం సొసైటీ అధ్యక్షుడు నేమాని సత్యనారాయణ రూ. లక్ష విరాళం అందజేశారు. సత్యం ఫౌండేషన్ ద్వారా 125 మంది విద్యార్థులను దత్తత తీసుకుని వాళ్లకు నచ్చిన కళాశాలలో చదివిస్తున్న సంగతి తెలిసిందే. సామాజిక సేవా కార్యక్రమాల నేపథ్యంలో రూ. లక్ష చెక్కు అందజేసానని నేమాని సత్యనారాయణ తెలిపారు. ఫౌండేషన్ చైర్మన్ ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు సి.రాజ్ కుమార్, డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యలు ప్రభుత్వానికి పట్టవా?

మండపేట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలు తగ్గించామంటూ ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవటం తగదని, రైతు సమస్యలు ప్రభుత్వానికి పట్టవా? అని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకర రావు ప్రశ్నించారు. విద్యుత్ చార్జీల్లో ట్రూ అప్ చార్జీలను తగ్గించి విద్యుత్ చార్జీలను తగ్గించామంటూ ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మండపేటలో మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ రెగ్యులేటర్ కమిటీ మొట్టికాయలు వేయటంతో ప్రభుత్వం ట్రూ అప్ చార్జీలు తగ్గిస్తామని ప్రకటించిందని గుర్తుచేశారు. అంతేకానీ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. రైతులకు యూరియాను అందించటంతో కూడా కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. వినియోగదారుల నుంచి వసూలు చేసిన ట్రూ అప్ చార్జీలను తిరిగి ప్రజలకు చెల్లించాలని కామన డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ నాయకులు పీసీసీ సభ్యులు ములపర్తి మోహనరావు, మాచవరపు శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతికి కారణమైన ఇద్దరి అరెస్టు

రాయవరం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): రాయవరం ముత్యాలమ్మ ఆలయం వద్ద సరిహద్దు వివాదం నేపథ్యంలో వెలమ సంఘం సభ్యులపై సరిహద్దుదారులు 28న రాళ్లదాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో గాయపడిన బి.సత్యనారాయణ చికిత్స పొందుతూ మృతి చెందగా మరో ఏడుగురు గాయపడ్డారు. ఈ కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు తెలిపారు. ఈసంఘటనలో నిందితులను త్వరితగతిన అరెస్టు చేసిన ఎస్ఐ సురేష్ బాబును, సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదు: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా అన్నారు. మంగళవారం రాయవరం పోలమ్మ ఆలయం పక్కనే ఉన్న ముత్యాలమ్మ ఆలయం వద్ద సంఘటనా ప్రాంతాన్ని ఎస్పీ పరిశీలించారు. దాడి ఘటన వివరాలను తెలుసుకున్నారు. తొలుత స్టేషన్‌లో రికార్డులను ఎస్పీ పరిశీలించారు. ఆయన వెంట సీఐ పి.దొరరాజు, ఎస్ఐ డి.సురేష్‌బాబు తదితరులు ఉన్నారు.



రాళ్లదాడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్ మీనా

చేనేత కార్మికుల రిలే నిరాహారదీక్షకు సంఘీభావం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి) : అంగరలోని గణపతి చేనేత సహకార సంఘానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆసంఘ సభ్యులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష మంగళవారం మూడవరోజుకు చేరింది. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చేనేత సహకార సంఘానికి రావాల్సిన రూ 3కోట్ల85లక్షల బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి దుర్గారావు, వైస్ ఎంపీపీ గుణ్ణం భాను ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామక పత్రం అందజేసిన ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ నియామక హామీని నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో రాయవరం మండలం చెల్లూరు గ్రామానికి చెందిన బక్కి అరుణ డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించి ఉపాధ్యాయ ఉద్యోగం పొందారు. ఈ నేపథ్యంలో ఆమెకు ఉద్యోగ నియామక పత్రాన్ని ఎమ్మెల్యే వేగుళ్ల ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో చెల్లూరు మాజీ సర్పంచ్ మోరంపూడి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



గొల్లప్రోలు మండలం చేబ్రోలులో దుర్గాదేవి మండపం వద్ద మాట్లాడుతున్న మంత్రి సుభాష్, పిఠాపురం పాదగయ క్షేత్రంలో...

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి: మంత్రి సుభాష్

గొల్లప్రోలు రూరల్, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): చిన్న నాటి నుంచే ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవరచుకోవాలని మంత్రి వాసంశెట్టి సుభాష్ సూచించారు. చేబ్రోలు గ్రామానికి చెందిన భవానీ భక్తుల ఆహ్వానం మేరకు మల్లవరం సెంటర్లోని దుర్గాదేవి మండపాన్ని ఆయన మంగళవారం దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం అనారోగ్య సమస్యతో బాధపడుతున్న పెంకే మహాలక్ష్మికి రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట శెట్టిబలిజ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పెంకే జగదీష్ ఉన్నారు.

పాదగయలో పూజలు

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పాదగయ క్షేత్రానికి కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం విచ్చేశారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

విడాకులు ఇచ్చేశారు



ప్రముఖ తమిళ సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్, ఆయన సతీమణి, నేపథ్యగాయని సైంధవి చట్టబద్ధంగా విడిపోయారు. వీరికి చెన్నై ఫ్యామిలీ కోర్టు మంగళవారం విడాకులు మంజూరు చేసింది. 2013లో వివాహం చేసుకున్న వీరికి అన్వీ అనే కుమార్తె ఉంది. మనస్పర్థల కారణంగా గత యేడాది విడిపోతున్నట్టు ప్రకటించి, విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో చివరగా ఈ నెల 25వ తేదీన విచారణ జరగ్గా, జీవీ ప్రకాశ్, సైంధవి కోర్టుకు హాజరై విడిపోయేందుకు సమ్మతం తెలిపారు. అదే సమయంలో తన కుమార్తె సంరక్షణ బాధ్యతలను సైంధవి స్వీకరించడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని జీవీ ప్రకాశ్ న్యాయమూర్తికి తెలిపారు. ఈ నేపథ్యంలో ఈ కేసు తుది తీర్పును మంగళవారం కోర్టు వెలువరించింది. జీవీ ప్రకాశ్ - సైంధవి దంపతులకు విడాకులు మంజూరు చేస్తూ, కుమార్తె సంరక్షణా బాధ్యతలను సైంధవికి అప్పగిస్తున్నట్లు ప్రకటించింది.

చెన్నై (ఆంధ్రజ్యోతి)



కౌబాయ్‌గా మళ్లీ వస్తున్న మెగాస్టార్

మెగాస్టార్ చిరంజీవి నటించిన ఏకైక కౌబాయ్ చిత్రం 'కొదమసింహం'. చిరంజీవి, శ్రీదేవి జంటగా నటించిన సూపర్ హిట్ చిత్రం 'జగదేకవీరుడు-అతిలోకసుందరి' విడుదలైన సరిగ్గా మూడు నెలలకు అంటే 1990 ఆగస్టు 9న కొదమసింహం విడుదలైంది. ఆ సమయంలో వస్తున్న చిత్రాలకు భిన్నంగా ఉండడంతో ప్రేక్షకులు ఈ సినిమాను బాగా ఆదరించారు. కైకాల సత్యనారాయణ సమర్పణలో ఆయన సోదరుడు నాగేశ్వర రావు నిర్మించిన 'కొదమసింహం' చిత్రానికి మురళీమోహనరావు దర్శకుడు. ఈ సినిమాలో చిరంజీవి సరసన రాధ, సోనమ్, వాణీవిశ్వనాథ్ నటించారు. మోహన్‌బాబు పోషించిన కామెడీ విలన్ పాత్ర 'సుడిగాలి' ఈ చిత్రానికి మరో ఆకర్షణ. 'కొదమసింహం' చిత్రాన్ని 4కెలోకి మార్చి, 5.1 డిజిటల్ సౌండింగ్ వంటి అదనపు హంగులు చేకూర్చి నవంబర్ 21న మళ్లీ విడుదల చేయనున్నారు. విజయదశమి సందర్భంగా చిత్ర నిర్మాత నాగేశ్వరరావు ఈ విషయాన్ని వెల్లడించారు. సంగీత దర్శకత్వ ద్వయం రాజ్-కోటి స్వరపరిచిన పాటలు ఈ చిత్రానికి మరో హైలైట్.

శుక్రాచార్యుడిగా అక్షయ్ ఖన్నా



ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వచ్చిన తొలి పాన్ ఇండియా చిత్రం 'హనుమాన్' బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన విషయం తెలిసిందే. దీనికి సీక్వెల్‌గా జై హనుమాన్' రూపుదిద్దుకుంటోంది. ఈ యూనివర్స్‌లో వస్తోన్న మూడో ప్రాజెక్ట్ 'మహాకాళి'. దీనికి ప్రశాంత్ వర్మ కథను సమకూర్చగా, పూజ అపర్ణ కొల్లూరు తెరకెక్కిస్తున్నారు. ఆర్కేడీ స్టూడియోస్ బేనర్‌పై రివాజ్ రమేశ్ దుగ్గల్ నిర్మిస్తున్నారు. హిందీ చిత్రం 'ఛావా'లో ఔరంగజేబు పాత్రను అద్భుతంగా పోషించిన అక్షయ్ ఖన్నా 'మహాకాళి'లో అసురుల గురువు శుక్రాచార్యుడిగా కనిపించనున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం. తాజాగా అక్షయ్ పాత్రను పరిచయం చేస్తూ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఒక భారీ కోట ముందు నిలబడి ఉన్నట్లు ప్రజెంట్ చేసిన తీరు ఆకట్టుకుంటోంది. కాగా, ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇప్పటికే 50 శాతం చిత్రీకరణ పూర్తయినట్లు చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సురేశ్ రగుతు, సంగీతం: స్మరణ్ సాయి.

సవాళ్లకు సిద్ధమే

సవాళ్లకు తానెప్పుడూ సిద్ధమే అంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయిక దీపికా పదుకొనే. ఐఎండీబీ తాజాగా పాతికేళ్ల భారతీయ సినిమా (2000-2025) జాబితాను విడుదల చేసింది. అందులో అత్యంత ప్రజాదరణ పొందిన నటీనటుల్లో దీపికా పదుకొనే నాలుగో స్థానంలో నిలిచారు. ఈ జాబితాలో స్థానం దక్కడంపై దీపిక మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచే సినీరంగంలో మహిళలు ఎలా నడుచుకోవాలో తరచూ నాకు చెప్పేవారు, అయితే అలాంటి మూస ధోరణిని సవాల్ చేయాలని నేను అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏదైనా నచ్చకపోతే వెంటనే ప్రశ్నించేదాన్ని. మహిళలు అణిగిమణిగి ఉండాలన్నట్లు ప్రవర్తించే ధోరణిని ఎదుర్కోవడం వల్ల ఇబ్బందులు పడాల్సి వస్తుందని నాకు తెలుసు. అయినా నేను వెనుకాడలేదు. నా కుటుంబం, అభిమానులు, సహచరులు నాకు అండగా నిలిచారు. ఎన్ని ఒత్తిళ్లు ఎదురైనా నాకు నచ్చినట్లు ఉండగలిగే శక్తిని, ధైర్యాన్నిచ్చారు. చివరకు నా నమ్మకం నిజమైంది. నా తర్వాతి తరం కథానాయికలకు ఒక కొత్తదారిని వేయగలిగాననే సంతృప్తి నాకు ఉంది' అని చెప్పారు. ప్రభాస్ కథానాయకుడిగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వం వహిస్తున్న 'స్పిరిట్' చిత్రం నుంచీ, అలాగే నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' సీక్వెల్ నుంచి ఆమె వైదొలగారు. 8 గంటల పని నిబంధనకు మేకర్స్ అంగీకరించకపోవడంతో ఆమె ఆ సినిమాల నుంచి వైదొలగారనే ప్రచారం జరిగింది. ఆ సమయంలో చెలరేగిన వివాదంపై దీపిక ఇలా పరోక్షంగా స్పందించారని బాలీవుడ్ విశ్లేషకులు అంటున్నారు.



ఉత్కంఠకు గురిచేసే ఆర్యన్



విష్ణు విశాల్, శ్రద్ధా శ్రీనాథ్ జంటగా ప్రవీణ్ కె తెరకెక్కించిన పరిశోధనాత్మక ఉత్కంఠ భరిత చిత్రం 'ఆర్యన్'. శుభ్ర, ఆర్యన్ రమేశ్, విష్ణు విశాల్ నిర్మాతలు. ఈనెల 31న తమిళం, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ టీజర్‌ని విడుదల చేశారు. ఓ హత్య కేసును దర్యాప్తు చేస్తోన్న విష్ణు విశాల్ పాత్రను టీజర్‌లో ఆసక్తికరంగా పరిచయం చేశారు. తనదైన శైలిలో, విభిన్నమైన నటనతో విశాల్ ఆకట్టుకున్నారు. 'రాట్ససన్' విజయం తర్వాత విష్ణు విశాల్ మరోసారి 'ఆర్యన్'లో పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు.

రెండొందల కథలు విని.. ఓకే చేశారు



కన్నడ చిత్ర కథానాయకుడు శ్రీమురళి కొత్త చిత్రం 'పరాక్' మంగళవారం బెంగళూరులో మొదలైంది. అక్కడి బండి మహాకాళి ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమంలో చన్నగిరి శాసన సభ్యుడు శివగంగ బసవరాజు తొలి క్లాప్ ఇచ్చి షూటింగ్‌కు శ్రీకారం చుట్టారు. హలేశ్ కోగుండి ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. 'ఇది ఒక వింటేజ్ స్టైల్ సినిమా. దాదాపు రెండొందల కథలు విని ఈ కథ ఓకే చేశాను. రెగ్యులర్ షూటింగ్ ఈ నెలలోనే ప్రారంభమవుతుంది' అని శ్రీమురళి చెప్పారు. బ్రాండ్ స్టూడియోస్ సంస్థ నిర్మిస్తున్న ఈ చిత్రానికి చరణ్‌రాజ్ సంగీత దర్శకుడు.

జాంబీ నేపథ్యంలో రణ్‌వీర్ చిత్రం

బాలీవుడ్ నటుడు రణ్‌వీర్ సింగ్ జాంబీ నేపథ్యంలో కొత్త సినిమా చేయబోతున్నారు. ఈ చిత్రానికి జై మెహతా దర్శకత్వం వహించనున్నారు. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'ప్రళయ్' అనేది వర్కింగ్ టైటిల్. రణ్‌వీర్ సింగ్ ప్రస్తుతం 'డాన్-3' షూటింగ్‌తో బిజీగా ఉన్నారు. ఇది పూర్తవడానికి మరో ఆరు నెలలు పడుతుంది. వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ఈ ప్రాజెక్టు పట్టాలెక్కనుందని, ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జోరుగా సాగుతున్నాయని బాలీవుడ్ మీడియా కథనం. మరో వైపు రణ్‌వీర్ సింగ్ సరసన నటించబోయే స్టార్ కథానాయిక కోసం చిత్రబృందం అన్వేషిస్తోంది.



మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



రావులపాలెం మండలం ఈతకోట కనకదుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో ద్రాక్షారామ మాణిక్యాంబ అమ్మవారు

అన్నదాన ట్రస్టుకు రూ.3.37 లక్షల విరాళం

ఆత్రేయపురం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన ట్రస్టుకు రాజమహేంద్రవరం హుకుంపేటకు చెందిన గాదిరాజు అనిల్‌కుమార్‌శర్మ రూ.2,87,555లు, సఖినేటిపల్లికి చెందిన సోమిశెట్టి సీతారత్నం రూ.50,116 విరాళాలు అందించారు. దాతలకు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాన్ని అందజేశారు. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఈ సందర్భంగా పలువురు భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారి దర్శనం చేసుకున్న అనంతరం భక్తజనం స్వామివారి అన్నప్రసాదంలో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది అన్ని చర్యలు తీసుకున్నారు.



రాయవరం మండలం వెదురుపాకలో గాడ్‌కు నమస్కరిస్తున్న గరికపాటి నరసింహారావు



రామచంద్రపురం మండలం ఓదూరులో దుర్గాష్టమి సందర్భంగా పూర్ణాహుతిలో పాల్గొన్న మంత్రి సుభాష్



ఆలమూరు మండలం పెదపళ్లలో దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

దుర్గమ్మా..శిరసా స్మరామి

• భక్తుల నామస్మరణతో మార్మోగిన అమ్మవారి ఆలయాలు • ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు • భవానీ మాలధారుల సందడి

ద్రాక్షారామ, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో దుర్గాష్టమి సందర్భంగా మాణిక్యాంబ సన్నిధిలో విశేష పూజలు జరిగాయి. అమ్మవారికి ఉదయం లక్షకుంకుమార్చన జరిపారు. తదుపరి వేదాపారాయణలు,దేవులపల్లి ఫణిరామకృష్ణచే శ్రీచక్రనవావర్ణార్చన జరిగింది.సాయంత్రం సువర్ణ,రజిత పుష్పార్చన జరిగింది. మాణిక్యాంబ అమ్మవారు దుర్గాష్టమి సందరంగా దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. శాసనమండలి సభ్యులు తోట త్రిమూర్తులు మాణిక్యాంబ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. దుర్గాష్టమి పురస్కరించుకుని అమ్మవారికి విశేష అలంకారం జరిపారు. భక్తులు అదిక సంఖ్యలో దర్శించుకున్నారు.

ఆలమూరు (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మంగళవారం మండలంలోని ఆయా గ్రామాల్లోని అమ్మవార్లను దుర్గాదేవిగా అలంకరించి పూజలు జరిపారు. పెదపళ్ల సంత మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన ఈ ఉత్సవాల్లో దుర్గాదేవిగా పూజించారు. అధిక సం ఖ్యలో మహిళలు కుంకుమార్చనలు జరిపారు. ఆలమూరు, జొన్నాడ, చెముడులంక, మూలస్థానం, మడికి, నర్సిపూడి, చొప్పెల్ల, మోదుకూరు, గుమ్మిలేరు, పెదపళ్ల, పినపళ్ల, సంది పూడి, చింతలూరు కలవచర్ల, పెనికేరు గ్రామాల్లో దుర్గాదేవిగా అమ్మవారు భక్తుల పూజలందు కున్నారు.

దుర్గాదేవిగా దర్శనం

ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో దుర్గాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్ల ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఉచ్చిలి కాలువరేవులో ఉన్న విజయదుర్గమ్మ దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భవానీ దీక్షదారులు ప్రత్యేక పూజలు జరిపారు.

వాడపల్లిలో ప్రత్యేక పూజలు: దుర్గాష్టమి వేడుకల్లో భాగంగా వాడపల్లిలో భవానీ మాలధారులు ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారి ఆలయం వద్ద పీఠంలో కుంకుమ పూజలు చేశా రు. అనంతరం దీపాలంకరణను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భవానీ మాలధారులు పలు పూజలు చేశారు.

ఓదూరులో దుర్గాష్టమి పూజలు

ద్రాక్షారామ (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం ఓదూరులో మంగళవారం దుర్గాష్టమి పూజలు ఘనంగా జరిగాయి. గ్రామంలోనున్న గోపాలస్వామి, సోమేశ్వరస్వామి, సీతారామ స్వామి ఆలయాల్లో జరిగిన దుర్గాష్టమి వేడుకల్లో మంత్రి సుభాష్ పాల్గొన్నారు. ఉదయం నుంచి సోమేశ్వరస్వామి ఆలయంలో డి.ఈశ్వరశర్మ యాజ్ఞికత్వంలో లక్ష బిల్వార్చన, కుంకుమ పూజలు నిర్వహించారు. గోపాలస్వామి ఆలయంలో ఖండవిల్లి సూర్యనారాయణాచార్యులు యాజ్ఞికత్వంలో లక్షతులసి పూజ జరిపారు. సీతారామ స్వామి ఆలయంలో ఏకాహ భజనలు జరిగాయి. సోమేశ్వరస్వామి, గోపాలస్వామి ఆలయాల్లో స్వామివార్లను మంత్రి సుభాష్ దర్శించుకుని పూజలు జరిపారు. పూర్ణాహుతిలో ఆయన పాల్గొని పూజలు చేశారు. ముందుగా మంత్రి సుభాష్‌కు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.శ్రీనివాస్, కూటమి నాయకులు కొండేపూడి సత్తి బాబు, సలాది కృష్ణ, వింజరపు శ్రీనివాస్ స్వాగతం పలికారు. దర్శనం అనంతరం పురోహితులు, అర్చకులు వేలూరి సూర్యప్రకాశరావు, చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, చక్రవర్తుల శ్రీనివాస చక్రవర్తి మంత్రి సుభాష్‌కు వేదాశీర్వచనం అందజేశారు. దుర్గాష్టమి పూజల్లో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, జనసేన నాయకులు చిక్కాల దొరబాబు పూజలు జరిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండేపూడి శ్రీనివాస జానకి రామయ్య, కొండేపూడి సురేష్, కొండేపూడి నారాయణరావు, కొండేపూడి కృష్ణమూర్తి, కొండేపూడి భాస్కరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కోటిపల్లి ఆలయంలో...

కె.గంగవరం (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం ఆయా దుర్గాదేవి ఆలయాల్లో ఏర్పాటు చేసిన మండపాల వద్ద దుర్గాష్టమి పూజలను ఘనంగా నిర్వహించారు. కోటిపల్లి ఛాయా సోమేశ్వరస్వామి ఆలయంలో రాజ రాజేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పామర్రు ఉమాపార్వతి సమేత మల్లీశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అధిక సంఖ్య లో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

వెదురుపాక ఆలయంలో ప్రత్యేక పూజలు

రాయవరం (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని 9వ రోజు మంగళవారం వెదురుపాక విజయదుర్గ అమ్మవారు దుర్గాదేవి అవతారంలో పూజలు అందుకుంది. పీఠం వేద పండితులతో వేకువజాము నుంచే అమ్మవారికి పంచ ద్రవ్యాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. అమ్మవారికి భక్తులతో దుర్గా అష్టోత్తర సహస్ర నామాలు, దేవీశక్తిమాల, దుర్గా ద్వాత్రింశ నామావళి, లక్ష్మి, సర స్వతి అష్టోత్తరాలతో కుంకుమ పూజలు జరిపారు. తొలిత వినాయక పూజ, నవగ్రహ అర్చనలు, భవానీ శంకర అష్టలింగేశ్వర స్వామికి ఏకవార రుద్రాభిషేకం జరిపారు. ఈసందర్భంగా లలితా, విష్ణు, సామూహిక పారాయణలు, సువాసినిలతో పూజలు, అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు. ఈసందర్భంగా పీఠాధిపతి గాడ్ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు.

గాడ్ ఆశీసులు పొందిన గరికపాటి, ఆర్డీవోలు: వెదురుపాక విజయదుర్గ పీఠాన్ని పద్మశ్రీ గరికపాటి నరసింహారావు దర్శించుకున్నారు. అమ్మవారికి ఆయన అర్చనలు, హారతులు నిర్వహించిన అనంతరం పీఠాధిపతి గాడ్ ఆశీసులు తీసుకున్నారు. పీఠంలో గరికపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. గాడ్ సమక్షం లో ఆయన్ను పీఠం ప్రతినిధులు సత్కరించారు. పీఠంలో మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ చేసిన ఆధ్యాత్మిక ప్రసంగం ఆకట్టుకుంది. అమ్మవారిని రామచంద్రపురం, కొత్తపేట ఆర్డీవోలు అఖిల, శ్రీకర్ దంపతులు సందర్శించి అమ్మవారికి పూజలు చేసిన అనంతరం గాడ్ ఆశీసులు పొందారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, పీఆర్వో బాబి, విజయదుర్గ సేవా సమితి సభ్యులు బుజ్జి, బి.రమ, జి.సత్యవెంకట కామేశ్వరి, భాస్కరనారాయణ, పి.సత్య కనకదుర్గ, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాష్టమి పూజలు

కొత్తపేట (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని కొత్తపేట శివారు బొరుసువారి సావరంలో ఉన్న విజయదుర్గమ్మ అమ్మవారికి మంగళవారం దుర్గాష్టమి పూజలు నిర్వహించారు. ఆలయ ఫౌండర్ బొరుసు వెంకట ఉదయభాస్కర్ ఆధ్వర్యంలో పూజలు జరిపారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని కుంకుమ పూజలు చేశారు.

సామూహిక కుంకుమ పూజలు

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయా అమ్మవారి ఆలయాల్లో కుంకుమ పూజలు నిర్వహించారు. ఈతకోట జాతీయ రహదారి చెంతన ఉన్న కనకదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమ పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. రావులపాలెం కాలువగట్టు చెంతన ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో అష్టోత్తర పూజలు, నీరాజన మంత్రపుష్పం తదితర పూజలు వైభవంగా జరిగాయి. మండల పరిధిలోని ఆయా గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు, దేవీ మండపాల వద్ద నిర్వహించిన పూజల్లో పలువురు భక్తులతోపాటు భవానీమాలధారులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జనరల్ నోటీసు

మహారాజశ్రీ రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.P.No. 33/2025

Between:
గారపాటి హరికృష్ణ & అదర్స్ ... పిటీషనర్స్
మరియు
పాలచర్ల రాంబాబు & అదర్స్ ... రెస్పాండెంట్స్

Adress And Discription of Parties

పిటీషనర్స్

1) గారపాటి హరికృష్ణ S/o జి.వీరాంజనేయులు, వయస్సు 50, Occ. Presently NIL and presently R/o డోర్.నెం. 4-19-59, నారాయణ స్కూల్ వీధి, అను బ్యూటీ పార్లర్, మండపేట టౌన్ & మండలం, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Limits, Aadhar No. 7015 0941 1933
2) గారపాటి పద్మావతి W/o జి.హరికృష్ణ, వయస్సు 41, House wife R/o డోర్.నెం. 4-19-59, నారాయణ స్కూల్ వీధి, అను బ్యూటీ పార్లర్, మండపేట టౌన్ & మండలం, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Limits, Aadhar No. 5246 6820 0613
3) వట్టికూటి లక్ష్మి W/o సత్యనారాయణ (లేటు) వయస్సు 72, నారాయణ స్కూల్ వీధి, అను బ్యూటీ పార్లర్, మండపేట టౌన్ & మండలం, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Limits,

రెస్పాండెంట్స్

1) పాలచర్ల రాంబాబు S/o పట్టాలి వయస్సు 63, R/O డోర్.నెం. కృష్ణ కళ్యాణి నగర్, కృష్ణ చైతన్య రెసిడెన్సీ, ఫ్లాట్ నెం. ఇ-11, మండపేట టౌన్ & మండల, డా.బి.ఆర్.ఎ. అంబేద్కర్ కోనసీమ జిల్లా, సెల్:8886190975 ఆలమూరు JCJC Limits
2) కొప్పాక వీర సునీత W/o వీర వెంకటసత్యనారాయణ (లేటు) వయస్సు 45 R/O డోర్.నెం.4-17-2, కాకతీయ నగర్ ఫస్ట్ వీధి, మండపేట టౌన్ & మండల, డా. బి.ఆర్.ఎ. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC
3) బొప్పే వెంకన్న S/o వయస్సు 55 R/O డోర్.నెం.1-15, ప్రక్కన శివాలయం వీధి, వల్లూరు గ్రామం కపిలేశ్వరపురం మండలం, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు సెల్: 7036623701 JCJC
4) వల్లూరి శ్రీనివాస్ S/o సుబ్బారావు, వయస్సు 35 R/O డోర్.నెం. 4-19-56/11, బ్యాంక్ కాలనీ, వైష్ణవి కిరాణ షాపు ప్రక్కన మండపేట. డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా
5) రెడ్డి లక్ష్మి W/o భాస్కరరావు వయస్సు 71 R/O డోర్.నెం.4-19-61, బృందావనం అపార్ట్‌మెంట్ ప్రక్కన మండపేట టౌన్& మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC
6) రెడ్డి భాస్కరరావు S/o సత్యం వయస్సు 73 R/O డోర్.నెం. 4-19-61, బృందావనం అపార్ట్‌మెంట్ ప్రక్కన మండపేట టౌన్ & మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC
7) గుణ్ణం సుశీల W/o సుబ్బారావు వయస్సు 60 R/O డోర్.నెం. 4-19-57, బిక్కిన అర్జున్న నగర్, మండపేట టౌన్ & మండలం, డా.బి.ఆర్.ఎ.కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9347151364
8) గుణ్ణం సూర్యప్రసాద్ S/o సుబ్బారావు వయస్సు 45 R/O డోర్.నెం. 4-19-57, బిక్కిన అర్జున్న నగర్, మండపేట టౌన్ & మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9701635777
9) పులి గణేష్‌రెడ్డి S/o అప్పలరెడ్డి వయస్సు 32 R/O డోర్.నెం. 20.184.6/1,46/1, ఆర్యాపురం రాజమండ్రి Rjy JCJC Cell:9290120081
10) రేలంగి రాధ W/o మురళి వయస్సు 33 R/O డోర్.నెం.4-19-1, బ్యాంకు కాలనీ నారాయణ స్కూల్ ప్రక్కన మండపేట టౌన్ & మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:8978649097
11) షేక్ ఇస్మాయిల్ S/o బాబ్జి వయస్సు 35 R/O డోర్.నెం.34-16-48, సప్తగిరి థియేటర్ ప్రక్కన మండపేట టౌన్ & మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:8096428714
12) పోలవరపు సత్యవతి W/o వీర్రాజు వయస్సు 70 R/O డోర్.నెం.34-17-18, భవాని వీధి, సత్యశ్రీ రోడ్, మండపేట టౌన్ & మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9505836868
13) ముత్యాల శకుంతల W/o సుబ్బారావు వయస్సు 65 R/O డోర్.నెం.28-3-62, పాత గొల్లపుంత మండపేట టౌన్ & మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9908572215
14) అందే గణపతి S/o సోమేశ్వరావు వయస్సు 48 R/O డోర్.నెం. 1-75, నేలటూరు గ్రామం, కపిలేశ్వరపురం మండలం, ఆలమూరు JCJC Cell:9290630378 డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా,
15) సత్తి వీరవెంకట సత్యనారాయణరెడ్డి S/o హరినారాయణరెడ్డి వయస్సు 40 R/O డోర్.నెం.5-124, పడాల కమలరెడ్డి ప్రక్క వీధి, రాయవరం గ్రామం మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9492148509
16) కర్రి నాగిరెడ్డి S/o వెంకటరెడ్డి వయస్సు 65 R/O డోర్.నెం.5-124, పడాల కమలరెడ్డి ప్రక్క వీధి, రాయవరం గ్రామం మండలం, డా.బి.ఆర్.ఎ.కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9492148509
17) చిర్ల రామన్నకాపు S/o సత్యం (లేటు) వయస్సు 60 R/O డోర్.నెం.8-57, అర్తమూరు గ్రామం, మండపేట మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC
18) ఉంగరాల సందీప్ & అదర్స్ S/o రాంబాబు వయస్సు 35 R/O డోర్.నెం.4-19-56/10ఎ, బ్యాంకు కాలనీ, మండపేట టౌన్ & మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9902410492
19) చోడే రాంబాబు S/o జానకీ రామయ్య వయస్సు 50 R/O డోర్.నెం. 4-2-16, పాటి మీద హెచ్.పి.గ్యాస్. దగ్గర మండపేట టౌన్ & మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9963200111
20) ముళ్ళపూడి రవీంద్ర S/o శ్రీనివాస్ వయస్సు 35 R/O డోర్.నెం.4-15-8, కృష్ణ థియేటర్ ప్రక్క వీధి రెహమాన్ క్లినిక్ దగ్గర, మండపేట టౌన్ & మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9948389595
21) ముత్యాల శ్రీనివాసు S/o కొండలరావు వయస్సు 57 R/O డోర్.నెం.2-66-2, ఫైర్ స్టేషన్ ఎదురుగా లేఅవుట్, మండపేట టౌన్ & మండలం, డా.బి.ఆర్.ఎ.కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC
22) ఆలపాటి శ్రీనివాసరావు S/o వెంకట్రావు వయస్సు54 R/O డోర్.నెం.4-22/2, చిట్టూరి భద్రరావు అపార్ట్‌మెంట్ వీధి, మండపేట టౌన్ & మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:7013946007
23) పులగం శ్రీనివాస్‌రెడ్డి S/o వెంకటరెడ్డి (లేటు) వయస్సు 51 R/O డోర్.నెం.6-48, రాయవరం గ్రామం, మండలం డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9963182079
24) ఎస్.వి. నాగిరెడ్డి S/o వెంకటరెడ్డి వయస్సు 33 R/O డోర్.నెం. 5-13/1, కొప్పవరం గ్రామం అనపర్తి మండలం, తూ.గో.జిల్లా, అనపర్తి JCJC Cell:9666832837
25) చిన్నం రామారెడ్డి S/o అమ్మిరెడ్డి వయస్సు 45 R/O డోర్.నెం. 4-19-26-1, రామచంద్ర రెసిడెన్సీ ఎదురుగా, మండపేట టౌన్ & మండలం డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9989627555
26) సూరంపూడి పావని D/o కడియాల శ్రీను (లేటు) వయస్సు 26 R/O డోర్.నెం.34-15-38, విజయలక్ష్మినగర్, బంధన్ బ్యాంక్ వీధి, మండపేట టౌన్ & మండలం డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9701017404
27) కడియాల శివ S/o శ్రీను వయస్సు 25 R/O డోర్.నెం.34-15-38/1, విజయలక్ష్మినగర్, బంధన్ బ్యాంక్ వీధి, మండపేట టౌన్ & మండలం డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9849712370
28) సత్తి వెంకటసుబ్బారెడ్డి S/o సత్తిరెడ్డి వయస్సు 49 R/O డోర్.నెం.6-52, రాయవరం గ్రామం మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9494649444
29) తాడి శ్రీనివాస్‌రెడ్డి S/o ధర్మారెడ్డి (లేటు) వయస్సు 48 R/O డోర్.నెం.8-15/1, అర్తమూరు గ్రామం మండపేట మండలం డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC
30) కొండేపూడి లక్ష్మి@ బూరమ్మ W/o భాస్కరరావు వయస్సు 55 R/O డోర్.నెం.5-104, జెడ్.మేడపాడు మండలం, డా.బి.ఆర్. ఎ.కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9394467784
31) సిద్దుల నాగమణి W/o వెంకటరత్నం వయస్సు 56 R/O డోర్.నెం.4-19-68, బ్యాంకు కాలనీ మండపేట టౌన్ & మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9959630779
32) పితాని రామకృష్ణ S/o ఏడుకొండలు వయస్సు 48 R/O డోర్.నెం. 34-16-50, భవాని వీధి, సత్యశ్రీ థియేటర్ ఎదురుగా మండపేట టౌన్ మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9704444621
33) సంకాబత్తుల లోవరాజు S/o అప్పారావు వయస్సు 48 R/O డోర్.నెం.34-15-7, సప్తగిరి థియేటర్ వెనుక మండపేట టౌన్ మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9701713646
34) గుంపిన సుబ్బారావు S/o సత్యం వయస్సు 49 R/O డోర్.నెం. 34-16-81, సత్యశ్రీ రోడ్, పాత బస్టాండ్, మండపేట టౌన్ మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:7013817175
35) సాయిరామ్ జ్యూయలర్స్ ప్రొ॥ గంగారామ్ S/o రామారావు వయస్సు 49 R/O కపిలేశ్వరపురం రోడ్, మండపేట టౌన్ & మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9441122212
36) పోలవరపు సాయి, తల్లి లక్ష్మి, హోటల్ బిజినెస్ 25 సం॥లు వయస్సు 25 R/O డోర్.నెం. 34-17-18 సత్యశ్రీ రోడ్, భవానీ వీధి మండపేట టౌన్ & మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9398499113
37) పచ్చాటొళ్ల నాగమణి W/o లోవరాజు వయస్సు 58 R/O డోర్.నెం. 4-19-56/26ఎ బ్యాంకు కాలనీ ఆర్.కె. అపార్ట్‌మెంట్ ఎదురుగా మండపేట టౌన్ & మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC Cell:9461685779
38) రిమ్మలపూడి జీవిత W/o రవీంద్ర వయస్సు 25, R/O డోర్.నెం. 4-15-8, శరవాడిపేట మండపేట టౌన్ & మండలం, డా.బి.ఆర్.ఎ. కోనసీమ జిల్లా, ఆలమూరు JCJC

పైన పేర్కొన్న ఐ.పి.నెం.33/2025 గ్రంథమునకు సంబంధించిన పిటీషనర్స్ తమను ఇన్‌సాల్వెంట్స్‌గా డిక్లేర్ చేయమని కోరుచూ, పిటిషన్ దాఖలు చేసియున్నారు. దీనికి సంబంధించి 4-11-2025 తేదిన వాయిదా అయి ఉన్నది. కావున దీనికి సంబంధించి ఎవరికైనా ఏవిధమైన అభ్యంతరాలు గాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల, మీరు స్వయంగా గాని లేదా అడ్వకేట్ గారి ద్వారా గాని ది.4-11-2025 ఉదయం గం॥10:30లకు శ్రీ కోర్టువారి ఎదుట హాజరై మీ సంజాయిషీ దాఖలు చేసుకోవలెను.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులను అనుసరించి)

మండపేట
29-9-2025

జొన్నపల్లి సత్యనారాయణ
పిటీషనర్స్ తరపు న్యాయవాది
మండపేట: 9347710166

గోదావరికి పోటెత్తిన వరద



ఆలమూరు మండలం జొన్నాడ పుష్కర ఘాట్ వద్ద గోదావరి ఉధృతి

ఆలమూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): గోదావరికి వరదనీరు పోటెత్తడంతో మండలంలోని పుష్కర్‌ఘాట్లతోపాటు లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలు ముంపుబారినపడ్డాయి. మండలంలోని జొన్నాడ, బడుగువానిలంక పుష్కర్‌ఘాట్‌లు వరదనీటిలో మునిగిపోయ్యాయి. బడుగువానిలంక, మడికి, చెముడులంక, చొప్పెల్ల, మూలస్థానం, జొన్నాడ, ఆలమూరు లంక భూముల్లో లోతట్టు ప్రాంతాల్లోని ఉన్న వాణిజ్య పంటలు ముంపునకు గురయ్యాయి. జొన్నాడ వద్ద రెండు బ్రిడ్జిల మధ్య గోదావరి ఉధృతిగా ప్రవహిస్తున్నది.

ఉప్పొంగి ప్రవహిస్తున్న గోదావరి

ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి): బొబ్బర్లంక కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి గౌతమి, వశిష్ట నదులు వరద నీటితో ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. మంగళవారం సాయంత్రానికి బొబ్బర్లంక బ్యారేజీ వద్ద 12.40 అడుగులకు వరద నీరు చేరుకుంది. భద్రాచలం వద్ద రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే గోదావరి లంకలను వరద తాకింది. మరింత పెరిగే అవకాశం ఉండటంతో వివిధ పంటలకు నష్టం సంభవించే అవకాశం ఉంది.

లంక గ్రామాల్లో అధికారుల బృందం పర్యటన

కపిలేశ్వరపురం (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ఉధృతి పెరిగిన నేపథ్యంలో ఆయా లంక గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు, పలు రకాల పంటలు ముంపునకు గురయ్యాయి. వరద ప్రవాహం పెరగడంతో లంక గ్రామాలైన కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, అద్దంకివారిలంక, పల్లపులంక గ్రామాల్లో మంగళవారం తహసీల్దార్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు అధికారుల బృందం పర్యటించింది. ఆయా గ్రామాల్లోని ప్రజా సమస్యలను తహసీల్దార్ తెలుసుకున్నారు. కేదార్లంక, నారాయణలంక, అద్దంకివారిలంక గ్రామాల్లోని కాజ్‌వేలను పరిశీలించి పరిస్థితులు తెలుసుకున్నారు. వరద పరిస్థితులపై ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులతో ఆయన సమీక్షించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులు, వీఆర్‌వోలు వెంకటేశ్వరరావు, రామకృష్ణ, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

'వైసీపీ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదు'

మండపేట, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైసీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులు పెరిగిపోయాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆరోపించారు. వైసీపీ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకోమని అన్నారు. కార్యక్రమంలో స్థానిక వైసీపీ నేతలు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



కొత్తపేట రిలయన్స్ స్మార్ట్ పాయింట్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యానందరావు

జీఎస్టీ తగ్గింపు ప్రయోజనం ప్రజలకు అందాలి

కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

కొత్తపేట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు ప్రజలు అందాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. మంగళవారం కొత్తపేటలోని రిలయన్స్ స్మార్ట్ పాయింట్‌ను ఆయన సందర్శించారు. వినియోగదారులకు జీఎస్టీ తగ్గింపు రేట్లు అందుతున్నాయా లేదా అనేది పరిశీలించడంతో పాటు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపార వర్గాలు జీఎస్టీ శాతాన్ని తగ్గించి అమ్మకాలు జరపకపోతే ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సంబంధిత వ్యాపార వర్గాలకు తెలిపారు. కార్యక్రమంలో నంబూరి రెడ్డియ్య, బూసి జయలక్ష్మి, కంఠంశెట్టి శ్రీను, పాలూరి సత్యానందం, ముత్యాల బాబ్జి, బూసి భాస్కరరావు, తమ్మన సాయిప్రసాద్, చిక్కం హనుమంతు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎంపీపీ పదవికి సత్యవేణి రాజీనామా

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 30 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి ఎంపీపీ పదవికి తన వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు తన రాజీనామా పత్రాన్ని ఆమె అందజేశారు. ఎంపీటీసీగా తాను కొనసాగుతానని ఆమె వినతి పత్రంలో పేర్కొన్నారు.

పిచ్చికుక్క స్వైరవిహారం

ఆత్రేయపురం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తూ పలువురిపై దాడికి పాల్పడింది. కొన్ని రోజులుగా పిచ్చికుక్క సుమారు 20 మందిపై దాడిచేసి గాయపరచడంతో ఆయా ప్రాంత గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పిచ్చికుక్కకు రాబిస్ సోకిందేమేనని గాయపడిన పలువురు భయాందోళన చెందుతున్నారు. మంగళవారం రెండేళ్ల బాలుడిపై దాడిచేసి గాయపరిచిందని స్థానికులన్నారు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటీన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. డాక్టర్లు సమ్మెలో ఉండటంతో సిబ్బంది వైద్య సేవలు అందించారు. పిచ్చికుక్క స్వైరవిహారంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మాజీ మున్సిపల్ చైర్మన్ జన్మదిన వేడుకలు

మండపేట, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): టీడీపీ యువనేత పట్టణ ఇన్‌చార్జీ మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ జన్మదిన వేడుకలను మంగళవారం మండపేట ఆలమూరు రోడ్డులో వున్న బాబు అండ్ బాబు కన్వెన్షన్ హాల్‌లో ఆయన అభిమానులు, కూటమి నాయకులు మధ్య జరుపుకున్నారు. నియోజకవర్గం నలమూలల నుంచి వచ్చిన అభిమానులు, పార్టీ శ్రేణులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన జన్మదిన వేడుకలను పురస్కరించుకుని వృద్ధాశ్రమంలో భోజనాలు పెట్టారు, వృద్ధులకు దుప్పట్లను అందించారు. ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో కూటమి నాయకులు, వివిధ వర్గాలకు చెందిన వారు తదితరులు వున్నారు.

నరసింహదేవర సేవలు చిరస్మరణీయం

ఆలమూరు, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎమ్మెల్సీ (ఉమ్మడి మద్రాసు రాష్ట్రం) ఎమ్మెల్సీ స్వర్గీయ నరసింహదేవర సత్యనారాయణమూర్తి వర్ధంతిని ఆలమూరులో మంగళవారం నిర్వహించారు. ఆలమూరు పీఏసీఎస్ వద్ద ఉన్న నరసింహదేవర విగ్రహానికి సహకార సంఘం అధ్యక్షుడు వంటిపల్లి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు నివాళులర్పించారు. రైతులకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. సహకార సంఘం డైరెక్టర్లు రామానుజుల సూర్యప్రకాష్, గుడాల నాగవెంకట్రావు, నరసింహదేవర మనుమడు నరసింహదేవర శ్రీను, నాయకులు ఈదల నల్లబాబు, రామనుజుల శేషగిరిరావు, కేతా రాంబాబు, బైరిశెట్టి రాంబాబు, సాలి సత్యనారాయణ, ఈదల రాంబాబు, ఎలుగుబంటి సాయి, సీతపో బొబ్బా రామసుబ్రహ్మణ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

ఆత్రేయపురం, సెప్టెంబరు 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దసరా కానుకగా జీఎస్టీ తగ్గించిన నేపథ్యంలో పలువురు స్థానికులకు అవగాహన కల్పిస్తున్నారు. మంగళవారం సూపర్ జీఎస్టీ అవగాహన కార్యక్రమంలో భాగంగా వెలిచేరులో వారు ఇంటింటి వెళ్లి వారు అవగాహన కల్పిస్తున్నారు. ప్రజలకు, వినియోగదారులకు ఆయా వస్తువులపై జీఎస్టీ రద్దు అంశాలపై వారు తెలుపుతున్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగిరెడ్డి సత్యనారాయణ, గంటా శివరామకృష్ణ, వరదా సూరిబాబు, కొప్పుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.